



జాబ్‌మేళాకు తరలివచ్చిన యువత

జాబ్‌మేళాకు విశేష స్పందన

నర్సాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. 60 సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు హాజరై 1,500 మందిని ఎంపిక చేసుకున్నారు. కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశారు. వేలాదిగా యువత తరలివచ్చి ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత ఉన్నవారిని వివిధ ఉద్యోగాల కోసం ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ యువత కోసం ప్రతీ ఏడాది జాబ్‌మేళాల నిర్వహిస్తామని తెలిపారు.



అండగా వెళ్లి..
హత్యకు గురై
భూతగాదాతో దాడి..
స్నేహితుడి బలి
ఒకరికి తీవ్ర గాయాలు 6

తోసేశాడా.. దూకేశారా?
దంపతుల ఆత్మహత్యాయత్నం
కేసులో కొత్త ట్విస్ట్
భర్తే.. భార్యను, పిల్లల్ని కోర్టు భవనంపై నుంచి తోసేశాడని పోలీసులకు ఫిర్యాదు 6

వార్డుల్లో శుభ్రతపై వంద రోజుల కార్యక్రమంలో
పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి
'తెలంగాణ రైజింగ్'కు చేయూతనివ్వాలని పిలుపు

సంగారెడ్డి టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రైసింగ్ తెలంగాణ పేరుతో వార్డుల్లో శుభ్రతపై చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణంలో 31, 32 వార్డుల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త కుప్పలు తీయుట, దోమల మందు పిచికారీ, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రైజింగ్‌కు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ రఘు, నాయకులు కూన సంతోష్, వార్డు ఇన్‌చార్జిలు సతీష్‌రెడ్డి, పుష్పమ్మ, మార్కెట్ కమిటీ రామ్ చెందారు నాయక్, నాయకులు రామ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, తులసీరామ్, శ్రీశైలం, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిర్మలా జగ్గారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



వార్డుల్లో శుభ్రతపై వంద రోజుల కార్యక్రమంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

జీవవైవిధ్యం
అమీన్‌పూర్ బయోడైవర్సిటీ చెరువు
పరిసరాలపై రియల్ మాఫియా పంజా
శిలల విధ్వంసం.. కనుమరుగవుతున్న
అద్భుత ఆనవాళ్లు
ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా రాళ్ల వ్యాపారం
అధికారుల నిర్లక్ష్యంపై పర్యావరణవేత్తల ఆవేదన 7

డిజిటల్ హెల్త్ కార్డులేవీ?
● ఇంకా శ్రీకారం చుట్టని సర్కారు ● ఖరారు కాని కార్యాచరణ



సంగారెడ్డి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యం, సంక్షేమం సర్కారు ప్రవేశపెట్టదలిచిన డిజిటల్ హెల్త్‌కార్డుల రూపకల్పనలో అడుగు ముందుకుపడడం లేదు. ఆధార్‌కార్డు తరహాలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్‌కార్డులు జారీ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. హెల్త్‌కార్డులతో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి తేవడం ద్వారా మెరుగైన వైద్య సేవలందించేందుకు వీలవుతుందని భావించింది. వైద్య ఆరోగ్యశాఖ, ఐటీ విభాగం సమన్వయంతో ఈ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది.

కార్డులో సమగ్ర సమాచారం

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు ద్వారా సంబంధిత వ్యక్తి ఆరోగ్యం, అనారోగ్య పరిస్థితులు, గతంలో అందించిన వైద్యం, చికిత్స, ఉపయోగిస్తున్న మందులు, సమస్య, డాక్టర్ల అభిప్రాయం, విశ్లేషణ వంటి తదితర సమగ్ర సమాచారం డిజిటల్ కార్డులో అందుబాటులో ఉండనున్నాయి. రాష్ట్రంలో ఎక్కడ చికిత్సకు వెళ్లినా ఈ వివరాలన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులకు వెంటనే తెలియడంతో మెరుగైన చికిత్స వైద్య సేవలకు అవకాశం ఉంటుంది. దీర్ఘకాలిక బాధితులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించడం, క్యాన్సర్ వంటి రోగాలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించే వీలుంటుంది.

ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత వివరాలను సేకరించి వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేక ఐడీ నంబరు కేటాయిస్తారు. బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నా గుర్తించి నమోదు చేస్తారు. రక్త, మూత్ర పరీక్షలు, ఎత్తు, బరువు, పొడవు, బ్లడ్ గ్రూప్, సర్జరీల వివరాలు, టీబీ ఇతర వ్యాధుల వివరాలు వ్యక్తిగత రికార్డులను రూపొందిస్తారు. అనంతరం వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందిస్తారు. ఏ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సకు వెళ్లినా గుర్తింపు సంఖ్య నమోదుతో వివరాలు వెంటనే అందుబాటులోకి వస్తాయి. ఏ వైద్యుడిని సంప్రదించినా వారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ కార్డు దోహదపడనుంది.

పైలెట్ ప్రాజెక్టు జిల్లాలు ఎంపిక చేసినా..

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డుల రూపకల్పనకు రాష్ట్రంలోని ములుగు, సిరిసిల్ల జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రజల ఆరోగ్య సమాచార నివేదిక తయారు చేశారు. అంతటితోనే పథకాన్ని నిలిపివేసింది. ప్రస్తుత సర్కారు మళ్లీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో డిజిటల్ ఆరోగ్య కార్డులపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

దొడ్డుబియ్యానికి పురుగు
మెదక్ జిల్లాలో భారీగా పేరుకుపోయిన నిల్వలు

బఫర్ గోదాముల్లో
3,086 మెట్రిక్ టన్నులు

ఎంఎల్ఎస్ పాయింట్లలో
259 మెట్రిక్ టన్నుల
దొడ్డు బియ్యం

రేషన్ షాపుల్లోనూ
503 ఎంటీల నిల్వలు

ముక్కిపోతున్న రూ.15 కోట్ల
విలువైన బియ్యం

సన్నబియ్యానికీ
పొంచిఉన్న ప్రమాదం



ఎమ్ఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ ఉంచిన దొడ్డు బియ్యం

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మెదక్ జిల్లాలో రూ.15కోట్ల విలువైన దొడ్డు బియ్యం పురుగు పట్టి పాడవుతున్నది. నిరుపేదల కోసం ఉద్దేశించిన ఈ బియ్యం సరైన నిల్వ సౌకర్యాలు లేక నాశనమవుతున్నది. అవే గోదాముల్లో నిల్వ చేయడంతో ప్రస్తుతం పంపిణీకి సిద్దంగా ఉన్న సన్నబియ్యానికి కూడా ప్రమాదం పొంచి ఉంది.

మెదక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, జిల్లాలోని రేషన్ షాపులు, మండల లెవెల్ స్టోరేజీ పాయింట్లలో భారీగా దొడ్డుబియ్యం నిల్వలు పేరుకుపోయాయి. జిల్లా పౌరసరఫరాల శాఖకు అందిన ఆదేశాల మేరకు ఈ దొడ్డు బియ్యాన్ని రేషన్ డిపోలు, ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వ చేశారు. ప్రస్తుతం, జిల్లాలోని 520 రేషన్ డిపోలలో 503 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ ఉంది. మెదక్, రామాయంపేట, పెద్దశంకరంపేట, పాపన్నపేట, తూప్రాన్, నర్సాపూర్, చేగుంటలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో 259 మెట్రిక్ టన్నులు, మూడు బఫర్ గోదాముల్లో 3,086 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం నిల్వ ఉంది. ఇలా మెదక్ జిల్లాలో 3,848 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం లక్క పురుగులకు ఆహారంగా మారుతోంది. దీని విలువ సుమారు రూ.15 కోట్లు ఉంటుందని అంచనా.

సన్నబియ్యానికీ ముప్పు

దొడ్డుబియ్యం నిల్వలకు సరైన భద్రత లేకపోవడంతో అవి ముక్కిపోయి పురుగులు పట్టి నాశనమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిల్వలకు తగిన వాతావరణం, శుభ్రత లేకపోవడం వల్ల బియ్యం తక్కువ వ్యవధిలోనే పాడయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలోనూ జిల్లాలోని ప్రభుత్వ గిడ్డంగులలో బియ్యం పురుగుపట్టి, ఎలుకలు, పందికొక్కులు తినడం వల్ల కోట్లాది రూపాయల విలువ చేసే బియ్యం నిరుపయోగంగా మారిన సంఘటనలు వెలుగుచూశాయి. లక్క పురుగు ఒకసారి బస్తాలో పుట్టినట్లయితే కొద్ది రోజుల్లోనే మొత్తం ధాన్యం నిల్వలకు వ్యాపిస్తుందని బియ్యం వ్యాపారులు తెలిపారు. అంతేకాదు, ప్రస్తుతం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న సన్నబియ్యానికి కూడా పురుగు వ్యాపించే ప్రమాదముంది. దొడ్డుబియ్యం నిల్వలు ఉన్న గోదాములు, రేషన్‌షాపుల్లోనే సన్నబియ్యం కూడా నిల్వ ఉంచడం వల్ల పాడయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల సన్నబియ్యం బస్తాల్లోకి ఈ పురుగు ప్రవేశించిందని సమాచారం. దొడ్డుబియ్యాన్ని తొలగించకుండా అవే గోదాముల్లో సన్నబియ్యాన్ని నిల్వ చేయడం వల్ల ప్రమాదం పెరిగిందని రేషన్ డీలర్లు వాపోతున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచిఉన్నాం



ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ డిపోలలో ఉన్న దొడ్డుబియ్యం నిల్వలపై నివేదిక సిద్ధం చేశాం. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 3,848 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం నిల్వలు ఉన్నాయి. సమయం ఎక్కువైతే బియ్యం పాడయ్యే ప్రమాదం ఉంది కాబట్టి త్వరలోనే వేలం నిర్వహించి బియ్యం నిల్వలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-సాము జగదీష్, మెదక్ జిల్లా సివిల్ సప్లయ్ డీఎం

ఇందిరమ్మ ఇల్లు రెడీ








రేగోడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇల్లు సిద్ధమైంది. ప్రభుత్వం సూచించిన ప్రకారం సకల హంగులతో ఇంటి నిర్మాణం పూర్తిచేశారు. పెయింటింగ్, ఎలక్ట్రిసిటీ పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు, అధికారులు తెలిపారు.
-రేగోడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

శాకాంబరిగా వనదుర్గామాత



ఆషాఢమాసం మొదటి ఆదివారం ఏడుపాయల వనదుర్గామాత శాకాంబరిగా దర్శనమిచ్చింది. వారాంతం కావడంతో ఉమ్మడి మెదక్ జిల్లావాసులతో హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునే భక్తులు మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానికి గంటల సమయం పట్టింది. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.
-పాపన్నపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)



ఎన్నాళ్లీ ఎదురుచూపులు?
ముందుకు సాగని జహీరాబాద్-బీదర్ రోడ్డు విస్తరణ
జాతీయ రహదారిగా మారుతుందని ప్రచారం
ఏడాదిగా కార్యరూపం దాల్చని పనులు



డివైడర్ లేకుండా రెండు వరుసలుగా ఉన్న జహీరాబాద్-బీదర్ రహదారి

జహీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్-బీదర్ రోడ్డు విస్తరణ ప్రక్రియ ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రోడ్డు విస్తరణపై ఆర్అండ్‌బి అధికారులు ప్రతిపాదనలు పంపించినా, అది ఎప్పుడు కార్యరూపం దాల్చుతుందో సంస్పష్టత లేదు. నిజాం కాలం నుంచి బీదర్‌తో జహీరాబాద్‌కు వ్యాపార, వాణిజ్య, వైద్యం, బంధుత్వాలతో సహా అనేక సంబంధాలున్నాయి. ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, ప్రయాణికులు, వ్యాపారులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ 50 బస్సులు రెండు పట్టణాల మధ్య తిరుగుతుంటాయి. ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న ఈ రోడ్డుపై నిత్యం రద్దీగా ఉండటం, తరుచుగా ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు వరుసలుగా విస్తరిస్తేనే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. గతేడాది కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రంలోని పలు రహదారుల అభివృద్ధిపై ప్రకటనలు చేసినప్పుడు, వికారాబాద్ జిల్లా మన్నెగూడ నుంచి తాండూరు, జహీరాబాద్, బీదర్ మీదుగా మహారాష్ట్రలోని వివిధ పట్టణాలను అనుసంధానిస్తూ దాదాపు 170 కిలోమీటర్ల మేర కొత్త రోడ్లు వేయడం, ఉన్న రోడ్లను జాతీయ రహదారిగా అభివృద్ధి చేయడం వంటివి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే జహీరాబాద్-బీదర్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు కూడా ఉన్నాయని స్థానిక ఆర్అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు. అయితే, ఏడాదిగా ఈ రోడ్డు జాతీయ రహదారిగా మారబోతోందని, నాలుగు వరుసలుగా వెడల్పు చేయబోతున్నారని చెబుతున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. అసలు ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో తెలియక వాహనదారులు, ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతానికి బీదర్‌తో ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా, ఈ రోడ్డును త్వరగా జాతీయ రహదారిగా మారుస్తూ విస్తరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అస్తబల్‌కు ఆషాఢమాస శోభ
తోటలో కొలువైన రేణుకా ఎల్లమ్మకు బోనాలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం రావడంతో సంగారెడ్డి పట్టణంలోని 'అస్తబల్' భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ ఫలపరిశోధన కేంద్రంలో ఉన్న రేణుకా ఎల్లమ్మకు పట్టణవాసులు ఆషాఢ మాసంలో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ప్రతీ ఆదివారం ఒక్కో బస్తీవాసులు బోనాలు సమర్పిస్తారు. వీలునుబట్టి ప్రజలు కుటుంబాలతో కలిసి సాధారణ రోజుల్లోనూ నైవేద్యాలు సమర్పిస్తారు. దీంతో నెలంతా అస్తబల్ తోట భక్తులతో కిటకిటలాడుతుంటుంది. తోటలోకి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై ఉన్న నల్ల పోచమ్మ ఆలయంతో పాటు తాళ్లపల్లి రోడ్డులోని దుర్గామాత ఆలయంలో నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ.



అస్తబల్ తోటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం

అండగా వెళ్లి.. హత్యకు గురై

భూతగాదాతో దాడి.. స్నేహితుడి బలి

ఒకరికి తీవ్ర గాయాలు..సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో దారుణం

కల్హేర్/సిర్గాపూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : దాయాదుల మధ్య భూ తగాదాలు, పాత కక్షలు తీవ్రరూపం దాల్చడంతో మారణాయుధాలతో దాడి చేసి దారుణ హత్యకు పాల్పడిన సంఘటన సిర్గాపూర్ మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో భూమి విషయంలో అండగా వచ్చిన స్నేహితుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖాజాపూర్ గ్రామానికి చెందిన కుర్మ హన్మండ్లు, కుర్మ రమేష్(34) దాయాదులు. వీరి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. రమేష్ తన భూమిలోకి వెళ్లాలంటే హన్మండ్లు భూమిని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయంలో వారిమధ్య తరచుగా ఘర్షణలు జరుగుతున్నాయి. అంతేకాకుండా, రమేష్ కుటుంబానికి చెందిన ఒక ఎకరం భూమిని కూడా దౌర్జన్యంగా హన్మండ్లు కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం కుర్మ రమేష్ తన స్నేహితుడు జైపాల్(35) తో కలిసి వ్యవసాయ భూముల వద్దకు వెళ్లాడు. అప్పటికే హన్మండ్లు కుటుంబసభ్యులు తమ భూమి వద్ద ఉన్న రేకులషెడ్డులో ఉన్నారు. ఇరువురి మధ్య మళ్లీ ఘర్షణ మొదలైంది. పాతకక్షలతో రెచ్చిపోయిన హన్మండ్లు కుటుంబసభ్యులు మారణాయుధాలతో రమేష్, జైపాల్‌పై దాడికి దిగారు. ఈ దాడిలో జైపాల్ తల తెగి అక్కడికక్కడే మరణించాడు. దాడితో అపస్మారకస్థితిలో పడిపోయిన రమేష్‌ను చంపడానికి ప్రయత్నిస్తుండగా, అతని తల్లి, మరో వ్యక్తి అక్కడికి చేరుకుని కేకలు వేయడంతో హన్మండ్లు కుటుంబసభ్యులు సంఘటనా స్థలం నుంచి పారిపోయారు.


మృతుడు కార్పట్ల జైపాల్(ఫైల్), గాయపడిన రమేష్


సంఘటన స్థలంలో క్లూస్ టీం, పోలీసుల పరిశీలన

విషయం తెలుసుకున్న సిర్గాపూర్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి వివరాలు సేకరించారు. సంఘటనా స్థలాన్ని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడు జైపాల్ తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కుర్మ హన్మండ్లు, అతని భార్య కవిత, కొడుకు పండరి, కోడలు వసుధ, తండ్రి సాయిగొండ, తల్లి కిష్టవ్వ, డాకుగొండ, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా భూ తగాదాలో కుర్మ రమేష్‌ను మట్టుబెట్టి, తమ భూముల పక్కనే ఉన్న మూడున్నర ఎకరాలను కబ్జా చేయాలనే పక్కా ప్రణాళికతోనే నిందితులు ఈ దాడికి పాల్పడినట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఏడుపాయలలో కారు బోల్తా.. బాలిక మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- కూతురు మృతికి కారణమైన వారిపై తండ్రి ఫిర్యాదు

పాపన్నపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఓ బాలిక మృతి చెందగా, పలువురికి గాయాలైన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. హైద్రాబాద్‌లోని బేగంపేటకు చెందిన కొత్తూరి ప్రతిమ(17) ఇంటర్ పూర్తి చేసింది. కొంతకాలంగా ఫతేనగర్ ప్రాంతానికి చెందిన గొల్ల చింటూ ప్రతిమను ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. ఈ విషయంలో చింటూను ప్రతిమ కుటుంబీకులు ఇదివరకే మందలించారు. అయినా తీరు మారలేదు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో వారికి చెప్పకుండా ప్రతిమ బయటకు వెళ్లింది. చింటూతో పాటు అతని స్నేహితులు మనోహర్, శివకుమార్ కలిసి శనివారం రాత్రి ఏడుపాయలకు ఇన్నోవా కారులో బయలుదేరారు. చింటూ కారు నడుపుతుండగా ప్రతిమతో పాటు ముందు కూర్చోగా, మిగిలిన వారు వెనక కూర్చున్నారు. రాత్రి సమయంలో ఏడుపాయలకు చేరుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆకలి వేస్తుందని భోజనం చేయడానికి పోతంశెట్టిపల్లి వైపు వెళ్తుండగా బస్టాండు సమీపంలోకి రాగానే కారు అతివేగంతో డివైడర్‌ను ఢీ కొట్టడంతో పల్టీలు కొట్టి బోల్తా పడింది. అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ప్రతిమ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. చింటూ, మనోహర్, శివకుమార్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఇంట్లో తెలియకుండా తన కూతురిని తీసుకువచ్చి ఆమె మృతికి కారణమైన చింటూపై చర్యలు తీసుకోవాలని ప్రతిమ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



ఏడుపాయల్లో బోల్తాబడ్డ కారును పరిశీలిస్తున్న పోలీసులు, ప్రతిమ మృతదేహం

ఇళ్లలో మోటార్లను అపహరిస్తున్న యువకుడు

దేహశుద్ధి చేసిన గ్రామస్థులు, పోలీసులకు అప్పగింత

శివ్వంపేట, జూన్ 29 ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో సంపు మోటార్లను తరచుగా దొంగిలిస్తున్న ఓ యువకుడికి మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మగ్దుంపూర్ గ్రామస్థులు ఆదివారం దేహశుద్ధి చేశారు. చావిడి దగ్గర జెండా స్తంభానికి కట్టేసి చితకబాది పోలీసులకు అప్పగించారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మగ్దుంపూర్ గ్రామానికి చెందిన కనికని పరశురాం, అతని బావమరిది రామచంద్రం ఇళ్లలోని సంపులపై ఉన్న మోటార్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. వారికి అనుమానం వచ్చి గ్రామానికి చెందిన కాశబోయిన ప్రశాంత్ అనే యువకుడి ఇంటిలో వెతకగా రెండు మోటార్లు దొరికాయి. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు ప్రశాంత్‌ను పట్టుకున్నారు. గతంలో కూడా ఓ వృద్ధురాలి మెడలో గుండ్లను చోరీ చేసిన ప్రశాంత్‌పై వారికి ఆగ్రహం ఉంది. దొరికిన ప్రశాంత్‌ను ఆదివారం ఉదయం మూడు గంటలకుపైగా చావిడి వద్ద జెండా స్తంభానికి తాడుతో కట్టి బంధించారు. చేతులతో, కర్రలతో చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, వారు అక్కడికి చేరుకున్నారు. గాయాలపాలైన ప్రశాంత్‌ను ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు. అపహరించిన రెండు మోటార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలు కనికని వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు. రెండు మోటార్లను స్వాధీనం ఎస్‌ఐ వెల్లడించారు.

నటుడు నీరుడి వీరేష్ కన్నుమూత

గబ్బర్‌సింగ్, రెబెల్ వంటి చిత్రాల్లో సైడ్ విలన్‌గా నటించిన వీరేష్

నర్సాపూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమలో సైడ్ విలన్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని హన్మంతాపూర్‌కు చెందిన నీరుడి వీరేష్ (40) ఆదివారం అనారోగ్యంతో కన్నుమూశారు. దీంతో హన్మంతాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గత కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరేష్, సినీ రంగంలో సైడ్ విలన్ పాత్రలు చేస్తూ జీవనం సాగించేవారు. ముఖ్యంగా ఆయన గబ్బర్‌సింగ్, రెబెల్, చెన్నై ఎక్స్‌ప్రెస్(హిందీ), తడాఖా, అరవింద సమేత వంటి పలు చిత్రాలతో పాటు అనేక సీరియల్స్‌లో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. రెండు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్న వీరేష్, ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న హన్మంతాపూర్ గ్రామ ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.


గబ్బర్‌సింగ్ సినిమా షూటింగ్ సమయంలో పవన్‌కల్యాణ్‌తో నీరుడి వీరేష్(ఫైల్)

తోసేశాడా.. దూకేశారా?

- దంపతుల ఆత్మహత్యాయత్నం కేసులో కొత్త ట్విస్ట్
- భర్తే భార్యను, ఇద్దరు పిల్లల్ని కోర్టు భవనంపై నుంచి తోసేశాడని పోలీసులకు ఫిర్యాదు

రామాయంపేట/మెదక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ కోర్టు భవనంపై నుంచి దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం మృతురాలి తల్లి మెదక్ పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన కూతురు, పిల్లలను ఆమె భర్తే భవనంపై నుంచి తోసి, తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నట్లు డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లాలోని రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రమ్యకు 2019లో దౌల్తాబాద్ వాసి నవీన్ గౌడ్‌తో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్లలోపు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెళ్లైన కొన్నాళ్ల తర్వాత మద్యానికి బానిసైన నవీన్, భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం రమ్య పిల్లలతో సహా పుట్టిల్లు లక్ష్మాపూర్‌కు వెళ్లింది. అయినప్పటికీ నవీన్ తీరు మార్చుకోలేదు. లక్ష్మాపూర్‌కు వచ్చి పలుమార్లు భార్యను తనతో రావాలని గొడవపడ్డాడు. రమ్య వెళ్లనందున ఏడాది క్రితం లక్ష్మాపూర్‌లో ఇంటిపై టపాసులు వేసి భయభ్రాంతులకు గురిచేశాడు. అప్పట్లో రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో అతనిపై కేసు నమోదై, నెల రోజులు జైలు జీవితం కూడా గడిపాడు. ఆరు నెలల క్రితం పలువురు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి, ఇక తాను మారుతానని నమ్మించి నవీన్, భార్యను దౌల్తాబాద్‌లోని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే లోక్ అదాలత్‌లో కేసుల ఉపసంహరణకు రాజీ కుదుర్చుకున్నారు. కానీ అతనిలో మార్పు రాలేదు. తాగుడుకు బానిసై, భార్యను అలాగే వేధించడం కొనసాగించాడు. శనివారం నవీన్ మొదట రామాయంపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, గత కేసు సమయంలో సీజ్ చేసిన తన బైక్, మొబైల్ తిరిగి ఇవ్వాలని కోరాడు. కోర్టు నుంచి తెచ్చుకోవాలని పోలీసులు తెలపారు. సాయంత్రం కోర్టు వేళలు ముగిసే సమయానికి నవీన్, రమ్య, పిల్లలను వెంట తీసుకుని కోర్టుకు వచ్చారు. అప్పటికే కోర్టు పని వేళలు ముగిసిపోయాయని సిబ్బంది తెలపడంతో అక్కడే కాసేపు వారి మధ్య వాగ్వావాదం జరిగింది. వారంతా అలాగే వాదులాడుకుంటూ కోర్టు భవనంపైకి చేరుకున్నారు. ఇద్దరి మధ్య గొడవ ముదిరి, స్థిమితం కోల్పోయిన నవీన్ రమ్యను, పెద్ద కుమార్తెను మొదట కిందకు తోసేశాడని రమ్య తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత చిన్న కుమార్తెనూ భవనం పైనుంచి విసిరేసి, ఆపై ఎలాగూ తనను జైల్లో పెడతారని భావించి, క్షణికావేశంలో నవీన్ కూడా దూకేసి ఉంటాడని వారి బంధువులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో రమ్య అక్కడికక్కడే చనిపోయింది. నవీన్, ఇద్దరు పిల్లలు చికిత్స పొందుతున్నారు. వీరు కోలుకుంటే కేసు పురోగతి ఉంటుందని భావిస్తున్నారు. లక్ష్మాపూర్‌లో ఆదివారం సాయంత్రం రమ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి.


చిన్న కూతురు రిత్వికతో రమ్య (ఫైల్)

నిత్య జీవితంలో స్వదేశీ వస్తువులను వాడాలి

స్వదేశీ జాగరణ్‌మంచ్ ఆల్‌ఇండియా కో కన్వీనర్ అజయ్ పాఠక్

మెదక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : స్వదేశీ వస్తువుల వినియోగం ద్వారా మన సంపద విదేశాలకు తరలిపోకుండా నిరోధించవచ్చని, తద్వారా దేశ ఆర్థిక శక్తి మరింతగా వృద్ధి చెందుతుందని స్వదేశీ జాగరణ్ మంచ్ ఆల్ ఇండియా కో కన్వీనర్ అజయ్ పాఠక్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ డెంటల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పురాతన వైద్యశాస్త్రంలో అగ్రగామిగా నిలుస్తున్న ఆయుర్వేదం, పంచకర్మ వంటి చికిత్సల ద్వారా థైరాయిడ్, పీసీవోడీ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్), హైపర్‌టెన్షన్ (అధిక రక్తపోటు) వంటి దీర్ఘకాలిక వ్యాధులను అదుపులోకి తీసుకురావచ్చని ఆయన వివరించారు. ముఖ్యంగా పంచకర్మ ద్వారా చిన్నపిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని శాస్త్రీయంగా రుజువైందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డెంటల్ డాక్టర్ చంద్రమౌళి, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ మమత, మంచ్ సంఘటనా కార్యదర్శి రచ్చ శ్రీనివాస్, డా.నారాయణగుప్తా, విజయ్‌కుమార్, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ పాఠక్



పాత ఎంజిబీ కాలనీలో జగన్నాథ రథయాత్ర

జయహో జగన్నాథా..

సిద్దిపేట, భారతీనగర్‌లో వైభవంగా రథయాత్ర

సిద్దిపేట కల్చరల్/రామచంద్రాపురం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథ రథ చక్రాలు కదిలాయి. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా పరిధిలోని భారతీనగర్ డివిజన్ పాత ఎంఐజీ కాలనీలో ఆదివారం జగన్నాథస్వామి రథయాత్రను అంగరంగవైభవంగా నిర్వహించారు. సిద్దిపేట హరేకృష్ణ సత్సంగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి జగన్నాథుడి రథం లాగుతూ జయజయ ధ్వానాలు చేస్తూ భక్తిపారవశ్యంలో తేలిపోయారు. శ్రీకృష్ణ భగవానుడి లీలామృత కీర్తనలు, ఆట పాటలతో యాత్ర కోలాహలంగా సాగింది. పట్టణంలోని వెంకటేశ్వరాలయం నుంచి మొదలైన యాత్ర గాంధీచౌక్ మీదుగా మార్కెట్ హన్మాండ్ల నుంచి సుభాష్ రోడ్డు, మోడ్రన్ బస్టాండ్, విక్టరీ చౌరస్తా నుంచి వెంకటేశ్వరాలయానికి రథయాత్ర చేరుకుంది. యాత్ర అనంతరం ఆలయంలోని శ్రీనివాస ధ్యాన మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సంకీర్తనం, ప్రవచనం, 108 రకాల భోగ నివేదన, మహాహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు భోజన మహా ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. భారతీనగర్ డివిజన్ పరిధి పాత ఎంఐజీలో కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి రథయాత్రను ప్రారంభించారు. ఆదివారం కావడంతో ఉద్యోగులు, యువతులు, చిన్నాపెద్ద భక్తులు పెద్దఎత్తున హాజరై రథాన్ని లాగారు. పురవీధుల గుండా ఊరేగింపు కొనసాగింది.



సిద్దిపేటలో రథంపై కొలువుదీరిన దేవుళ్లు



సిద్దిపేటలో జగన్నాథ రథయాత్ర





రథాన్ని లాగుతున్న మహిళలు

క్రైం కార్నర్

భవనంపై నుంచి జారిపడిన కార్మికుడు చికిత్స పొందుతూ మృతి

శివ్వంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన శివ్వంపేట మండలంలోని శభాష్‌పల్లిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నార్సింగి గ్రామానికి చెందిన కండ్లకోయ ఆనంద్(21) శనివారం శభాష్‌పల్లిలో భవన నిర్మాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు భవనంపైనుంచి జారి పడిపోయాడు. తోటి కార్మికులు, స్థానికలు ఆనంద్‌ను వెంటనే తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతిని తండ్రి సిద్ధిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఝరాసంగం, జూన్29 (ఆంధ్రజ్యోతి) : పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన ఘటన మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుట్టుచప్పుడు కాకుండా తుమ్మన్‌పల్లి శివారులో పేకాట స్థావరాన్ని కొనసాగిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.19 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నాగులపల్లిలో బైక్ చోరీ

తూప్రాన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం నాగులపల్లిలో ఆదివారం తెల్లవారుజామున బైక్ చోరీకి గురైంది. వివరాల్లోకి వెళితే.. నాగులపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కొండ సిద్ధిరాములు యాదవ్ శనివారం రాత్రి ఇంటి ఎదుట ప్యాషన్ ప్రో బైక్ (టీఎస్ 13 ఈపీ 1673)ను పార్కు చేశాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు బైక్‌ను చోరీ చేశారు. చుట్టుపక్కల గాలింపు చేసినప్పటికీ లభించలేదు. బైక్ చోరీపై తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిద్ధిరాములు వివరించారు.

యువతి అదృశ్యం



సంగీత


రామాయంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన ఘటన రామాయంపేట మండలం కాట్రియాలలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మైలారం సంగీత(21) శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరక లభించలేదు. యువతి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజ్ తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలు సీజ్



సీజ్ చేసిన లారీ

కొండాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్న వాహనాలను కొండాపూర్ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అనుమతులు లేకుండా మండలంలోని హరిదాస్‌పూర్ నుంచి మట్టిని తరలిస్తున్నారని పక్క సమాచారంతో శనివారం రాత్రి వాహనాలను పట్టుకుని కొండాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాలుగు టిప్పర్లు, ఒక్క ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి పోలీసులకు అపగించినట్లు తహసీల్దార్ అశోక్ తెలిపారు.



సహజ సిద్ధంగా రాళ్ల మధ్య ఏర్పడిన గుహ



డిటోనేటర్‌తో రెండుగా చీల్చిన అపురూపమైన భారీ శిల

జీవవైవిధ్యం

అమీన్‌పూర్ బయోడైవర్సిటీ ప్రాంతంపై రియల్ మాఫియా పంజా

శిలల విధ్వంసం.. కనుమరుగవుతున్న అద్భుత ఆనవాళ్లు

ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా రాళ్ల వ్యాపారం

అధికారుల నిర్లక్ష్యంపై పర్యావరణవేత్తల ఆవేదన

అమీన్‌పూర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నగర శివారు, పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ పెద్దచెరువు, దాని పరిసర ప్రాంతాలు జీవవైవిధ్య (బయోడైవర్సిటీ) ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించబడినప్పటికీ, ప్రస్తుతం రియల్ ఎస్టేట్ మాఫియా చేతిలో తీవ్ర విధ్వంసానికి గురవుతున్నాయి. సుమారు వంద ఎకరాలలో విస్తరించిన పెద్దచెరువు, దాని చుట్టూ ఉన్న గుట్టలు, అద్భుతమైన భారీ శిలాజాలను సైతం జీవవైవిధ్య ప్రాంతాలుగా నోటిపై చేస్తూ గతంలో సంగారెడ్డి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో జీవవైవిధ్యం అంతా మిథ్యగా మారిందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురాతన శిలలు కనుమరుగు

చెరువు కట్టను ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 343లోని ప్రభుత్వ భూముల్లో విస్తరించి ఉన్న గుట్ట రాళ్లను రియల్ మాఫియా బద్దలు కొడుతోంది. పర్యావరణవేత్తల ప్రకారం, ఈ రాళ్లు సుమారు 2.5 బిలియన్ సంవత్సరాల పూర్వంనాటి (డైనోసార్ల యుగం నాటివి) శిలలని పురాతత్వ నిపుణులు తెలుపుతున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించే ఉద్దేశంతో, అపురూపమైన భారీ గుండ్రని రాళ్లను డిటోనేటర్లతో పేల్చి, ఇక్కడి నుంచి తరలిస్తున్నారు. వీటి మధ్య ఏర్పడిన గుహలు సైతం ధ్వంసమవుతున్నాయి. ఇది కేవలం భూ ఆక్రమణ మాత్రమే కాకుండా, కోట్లాది సంవత్సరాల చరిత్ర కలిగిన సహజసిద్ధమైన వారసత్వాన్ని నాశనం చేయడమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన

నెల రోజులుగా ప్రభుత్వ సర్వే నంబర్‌లోని భారీ రాళ్లను రియల్ మాఫియా కనుసన్నల్లో బద్దలు కొడుతున్నారు. భారీ డిటోనేటర్లను ఉపయోగించి పేల్చివేసి, అరుదైన శిలలను కనుమరుగు చేస్తూ భూమిని చదును చేస్తున్నారు. గతంలో అమీన్‌పూర్ తహసీల్దార్ వెళ్లి పనులను అడ్డుకున్నప్పటికీ, ప్రస్తుతం పనులు యథాతథంగా కొనసాగడంపై చుట్టుపక్కల కాలనీల ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యంలో కీలకపాత్ర వహించే బృహత్ శిలలను కాపాడటంలో ఆర్కియాలజికల్ విభాగం సైతం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే సంగారెడ్డి కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, జీవవైవిధ్య రాళ్లను, చెరువును పరిరక్షించాలని ప్రజలు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. ఈ విధ్వంసం ఇలాగే కొనసాగితే అమీన్‌పూర్ జీవవైవిధ్యం పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.



పెద్దచెరువులో వలస పక్షులు (ఫైల్)

చెదిరిపోయిన వలస పక్షుల విడిది కేంద్రం

ఒకప్పుడు అమీన్‌పూర్ చెరువు చుట్టూ విస్తరించిన ఎత్తైన గుట్టలు, పంటపొలాలు, చెరువుకు రక్షణ వలయంగా ఉండేవి. ప్రతి సంవత్సరం వేల మైళ్ల దూరం నుంచి విదేశీ వలస పక్షులు ఈ గుట్టల్లోని రాళ్ల మధ్య గుడ్లను పొదిగేవి. అయితే, 343 సర్వే నంబర్‌లో ఉన్న భారీ రాళ్లు క్రమంగా కనుమరుగవడం, పచ్చదనం ఉన్న చోట కాంక్రీట్ భవనాల నిర్మాణం కావడంతో పక్షులకు ఆవాసం లేకుండా పోయింది. ఒకవైపు అమీన్‌పూర్ పెద్దచెరువు మురుగు నీటితో నిండుతుండగా, మరోవైపు గుడ్లను పొదిగేందుకు కావాల్సిన ప్రాంతం విధ్వంసమవడంతో వలస పక్షుల రాక క్రమంగా తగ్గిపోయిందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు పేర్కొంటున్నారు.

ఘనంగా ఆషాఢమాస ఉత్సవాలు

- కూచన్‌పల్లిలో గోరింటాకు వేడుకలు
- బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు

మెదక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం సందర్భంగా మహిళల గోరింటాకు వేడుకలు మెదక్ జిల్లాలో ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హవేళీఘనపూర్ మండలం కూచన్‌పల్లిలోని కూచాద్రి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంగణమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అందంగా అలంకరించిన వేదిక వద్ద గోరింటాకు పెట్టుకునేందుకు స్నేహితురాళ్లతో కలిసి సందడి చేశారు. సాయంత్రం జరిగిన సభలో సంఘ నాయకులు, ముఖ్య అతిథులు ప్రసంగించారు. ఈ సందర్భంగా మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్ మాట్లాడుతూ ఆషాఢమాసం భక్తి, ప్రపత్తులకు ప్రతీక అని అభివర్ణించారు. గోరింటాకు వేడుకల ద్వారా మన సంప్రదాయాలను పునరుజ్జీవింపజేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు. ఈ వేడుకల్లో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మధ్యాహ్న సమయంలో సామూహిక విందు భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలను మెమొంటోలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మోతుకూరి రామేశ్వర్‌రావు, జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు సలాక రాజన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైద్య ప్రభాకరశర్మ, వైద్య శ్రీనివాస్, సలాక రాజేశ్వర్, గిరిధర్ దేశ్‌పాండే, ఉమాశంకర్, ఎస్.రాధాకృష్ణ, అదితిశర్మ, శ్యామ్, శ్రీనాథ్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



వేడుకలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా బ్రాహ్మణసంఘ నేతలు



గోరింటాకు పెట్టుకుంటున్న దృశ్యం

అదిగదిగో.. తెలంగాణ పండరి

94వ ఆషాఢి ఉత్సవాలకు మర్కుక్ పాండురంగాశ్రమం ముస్తాబు

జూలై 5 నుంచి మూడు రోజుల ఆధ్యాత్మిక సంబురం

చాటలతో అన్నప్రసాద వితరణ ఇక్కడ ప్రత్యేకం

భక్తుల సంఖ్యను భగవంతుడే నిర్ణయించే అద్భుతం

మర్కుక్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని భావానందపురంలోని పాండురంగాశ్రమంలో 94వ ఆషాఢి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. భక్తులు పులకించిపోయే త్రిరాత్రోత్సవాలు ఈ జూలై 5 నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. పచ్చని ప్రకృతి వనాలు, పక్షుల కిలకిల రావాలు, అడుగడుగునా అపర భక్తుల విగ్రహాలతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండి ఉంటుంది. తెలంగాణ పండరిగా పేరుగాంచిన ఈ ఆశ్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు.

మూడు రోజుల ఆధ్యాత్మిక వైభవం

ఆషాఢి ఉత్సవాలు మూడు రోజులపాటు అఖండ నామస్మరణతో మార్మోగనున్నాయి. తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుక్మిణీ పాండురంగ స్వామికి క్షీరాభిషేకంతో భక్తోత్సవం ప్రారంభమవుతుంది. రెండో రోజు ఏకాదశి ఉపవాసాలు, జాగరణలతో ఆశ్రమ ప్రాంగణమంతా కిక్కిరిసిపోనుంది. ఇక మూడో రోజు ద్వాదశి మహా అన్నపూజతో వేలాది మంది భక్తులకు అన్నదానం చేసి జాతరను పరిసమాప్తం చేస్తారు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి నల్గొండ, వరంగల్, మెదక్ తదితర జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు.



ఈసారి ప్రత్యేకత మహాసాద మంటపం

తొమ్మిది దశాబ్దాలుగా ఆషాఢి ఉత్సవాల సమయంలో ఆలయం ఎదురుగా ఉన్న తోటలోనే ద్వాదశి అన్నదానం జరిగేది. అయితే, ఈసారి భక్తుల సహకారంతో నిర్మించిన మహాసాద మంటపం అందుబాటులోకి వచ్చింది. అన్నదాన కార్యక్రమం ఈ విశాలమైన మంటపంలోనే జరగనుంది.



9 దశాబ్దాల చరిత్ర

సుమారు 9 దశాబ్దాల క్రితం, భవానంద భారతి స్వామివారు మహారాష్ట్రలోని పండరీపూర్ నుంచి పాదయాత్రగా రుక్మిణి పాండురంగ విగ్రహాలను ఇక్కడికి తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నిత్యకల్యాణం, పచ్చతోరణం అన్నట్లు భగవంతుడికి పూజలు, భక్తులకు అన్నదానం నిరంతరాయంగా సాగుతున్నది. మరో ఆరేళ్లలో ఈ ఆషాఢి ఉత్సవాలు శతవసంతాలను పూర్తి చేసుకోనున్నాయి.

ఆకట్టుకోనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఏకాదశి ఉదయం నుంచి ద్వాదశి ఉదయం వరకు సాద మంటపంలో హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రముఖులతో హరికథాగానాలు, నామ సంకీర్తనలు, చక్రీ భజనలు, కోలాటాలు, పేరిణి నృత్యాలను నిర్వహించనున్నారు. స్వామివారి శిష్యులైన కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

భక్తుల రాక భగవంతుడికే ఎరుక!

ఈ ఆశ్రమంలో జరిగే అన్నదానం ఒక అద్భుతం. ప్రతీ సంవత్సరం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఎంతమంది వచ్చినా, వండిన అన్నప్రసాదం ఒక మెతుకు కూడా తక్కువ కాకుండా, కచ్చితంగా అందరికీ సరిపోతుంది. ఇది ఎలా జరుగుతుందని అందరూ ఆశ్చర్యపోతుంటారు. ఇక్కడ ఆశ్రమ నిర్వాహకులు ప్రతీసారి ఎన్ని క్వింటాళ్ల అన్నం వండాలో సాక్షాత్తు పాండురంగ స్వామిని అడగడం విశేషం. చీటీలు రాసి స్వామి ముందు పెడతారు. అందులో ఒకటి తీసి, అందులో వచ్చిన సంఖ్య ప్రకారం అన్నం వండుతారు. అది వచ్చిన భక్తులందరికీ సరిగ్గా సరిపోతుంది. భక్తులు ఎంతమంది వస్తారో భగవంతుడే నిర్ణయించే అద్భుతమైన ఉత్సవం ఇది. మరో ప్రత్యేకత ఏమిటంటే, అన్నాన్ని రాశిగా పోసి పూజచేసి, ఆ తర్వాత చాటల ద్వారా వడ్డించడం. ద్వాదశి రోజు నిర్వహించే సామూహిక భోజనంలో ఒక్క ముద్దైనా తినాలని, ఒక్క చాటతోనైనా వడ్డన చేయాలని కులమత, పేదధనిక తేడా లేకుండా భక్తులంతా పోటీ పడుతుంటారు.

పాండురంగాశ్రమ ఉత్సవాల షెడ్యూల్

త్రిరాత్రోత్సవాలకు ముందే ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. జూలై 1న భగవన్నామ శోభాయాత్ర, 2న యతివర భావానంద భారతీస్వామి పాదుకాపూజ, 3న సీతారామచంద్రస్వామికి క్షీరాభిషేకం-పుష్పార్చన, 4న భవానీశంకరులకు ప్రత్యేక పూజలు, 5న త్రిరాత్రోత్సవాలు ప్రారంభం, 6న తొలి ఏకాదశి విశేష పూజలు, 7న ద్వాదశి మహాఅన్న పూజ - అన్నప్రసాద వితరణ



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

న్యూస్ బాక్స్

ఘనంగా బోనాల పండుగ

సంగారెడ్డి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసంలో మొదటి ఆదివారం కుమ్మర్ల సంఘం నాయకులు రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ బోనాల జాతర మహోత్సవంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు చింతా సాయినాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బోనాల మహోత్సవంలో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కట్టమైసమ్మ జాతర

తూప్రాన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామంలో ఆదివారం కట్ట మైసమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. పంటలు సంమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మహదేవి నవీన్, జిన్నస్వామి, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో జూలై 21న బోనాలు

పటాన్‌చెరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో జూలై 21న బోనాల పండుగను జరుపుకోవాలని పట్టణ పెద్దలు ఆదివారం నిర్ణయించారు. పట్టణంలోని కోదండరామాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. బోనాల పండుగకు ప్రభుత్వం తరపున జీహెచ్ఎంసీ అన్ని ఏర్పాట్లను చేయాలని పుర ప్రముఖులు కోరారు.

గురుపౌర్ణమి గోడ పత్రిక ఆవిష్కరణ

ఝరాసంగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో జూలై 4 నుంచి 10 వరకు కొనసాగనున్న గురుపౌర్ణమి ఉత్సవాల గోడ పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. వైరాగ్య శిఖామణి అవదూత గిరి మహారాజ్ ఆధ్వర్యంలో పులిమామిడి రాజు విడుదల చేశారు. నందినిగిరిమాత, మల్లేశం, రాము తదితరులు పాల్గొన్నారు.

'తపస్' సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్


సుధాకర్

సంగారెడ్డి అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోట సుధాకర్ నియమితులైనట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత సురేష్ తెలిపారు. సుధాకర్ సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖానాపేట జడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల ఏర్పాటు

చేగుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కొలుపుల రామస్వామి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జూలై 7 వరకు ఎమ్మార్పీఎస్ గద్దెల నిర్మాణం చేపట్టాలన్నారు.

ఎంపీకి పరామర్శ

పటాన్‌చెరు/సంగారెడ్డి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాలి శస్త్రచికిత్స అనంతరం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ యోగక్షేమాలను తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అదేవిధంగా, బీజేపీ సంగారెడ్డి జిల్లా నాయకులు కూడా ఎంపీ రఘునందన్‌రావును పరామర్శించారు. ఎంపీని పరామర్శించిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండాపురం జగన్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా నాయకులు పవన్, గురనాథ్, రవి, సురేష్, రాజు తదితరులు ఉన్నారు.

'డబుల్ బెడ్‌రూం ఇళ్లను అందించాలి'

జహీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని హోతి(కె) శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండేళ్ల క్రితం ఇళ్లను నిర్మించి, లబ్ధిదారులను ఎంపిక చేసి, పట్టా సర్టిఫికెట్లను అందజేసినప్పటికీ, ఇళ్లను అప్పగించడంలో అధికారులు, నాయకులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 9న ఆందోళన చేపడితే ఈ నెలాఖరులోగా అందిస్తామని చెప్పిన తహసీల్దార్ దశరథ్.. ఇప్పటికీ అందించలేదన్నారు. ఈ విషయమై రేపటి నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు సలీమొద్దీన్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

కంపు.. కంపు


ఐడీఏబొల్లారం పరిధిలోని మీరాబాయి కుంట దుస్థితి


రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువులో గుర్రపుడెక్క

రామచంద్రాపురం/రామచంద్రాపురం టౌన్/ ఐడీఏ బొల్లారం/ జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం, ఐడీఏ బొల్లారం, తెల్లాపూర్ ప్రాంతాల్లో తీవ్రమైన పారిశుధ్య లోపం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తోంది. రాయసముద్రం చెరువులో పెరిగిన గుర్రపుడెక్క కారణంగా దోమల బెడద విపరీతంగా పెరిగి, చుట్టుపక్కల 15 కాలనీల ప్రజలు నిత్యం రోగాల బారిన పడుతున్నారు. ఐడీఏ బొల్లారం పరిధిలోని మీరాబాయికుంట వ్యర్థాలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. బతుకమ్మ ఘాట్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు, తెల్లాపూర్ శివారులో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల నుంచి వస్తున్న మురుగునీటితో సమస్య జఠిలంగా మారింది. మూడేళ్ల క్రితం ఇచ్చిన ఎస్టీపీ ఏర్పాటు హామీ నెరవేరకపోవడంతో రోడ్లపై మురుగునీరు పరుగుపెడుతున్నది. అక్రమ పార్కింగ్, భవన నిర్మాణదారులు మురుగు ప్రవాహానికి అడ్డంగా మట్టి వేయడంతో సమస్య మరింత జఠిలంగా మారుతుంది. వర్షాకాలం సమీపిస్తున్నందున ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉన్నందున, అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


తెల్లాపూర్‌లో మురుగునీటిలో వాహనాల రాకపోకలు


మురుగు నీటికి అడ్డంగా మట్టివేసిన భవన నిర్మాణదారుడు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి


రింగ్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యేసంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా ఖేడ్ పట్టణం చుట్టూ లింక్ రోడ్లను కలుపుతూ నిర్మిస్తున్న రింగ్ రోడ్డును ఆయన మున్సిపల్ తాజా మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్‌తో కలిసి రింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, ఆవుటి శంకర్, జానీపటేల్, నాయకులు ఉన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీలో ఆదివారం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. పదేళ్ల క్రితం శివారు ప్రాంతాలు అస్తవ్యస్తంగా ఉండేవని, అనేక కాలనీలకు రోడ్డు సౌకర్యం కూడా లేదని గుర్తు చేశారు. ఒక ప్రణాళికాబద్ధంగా రోడ్లు, తాగునీరు, విద్యుత్ అవసరాలు, డ్రైనేజీ వసతులు కల్పిస్తున్నామన్నారు. అందుకోసం సుమారు రూ.7కోట్లతో వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య



మాట్లాడుతున్న నాగయ్య

సంగారెడ్డి రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సమాజంలో దోపిడీ, అణచివేత పోయి సమసమాజ నిర్మాణం కావాలంటే అది కేవలం మార్క్సిస్టు సిద్ధాంతం ద్వారానే సాధ్యమన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రం నాలుగు లేబర్ కోడ్లతో కార్పొరేట్, యాజమాన్యాలకు వత్తాసు పలుకుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, మాణిక్యం, జి. సాయిలు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

కొల్చారం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండలం రంగంపేట ఉన్నత పాఠశాల 1994 - 95 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల పరిధిలోని పోలంపల్లి పెంటయ్య ఫంక్షన్ హాల్‌లో ఒక చోట చేసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

'నీటి అద్దం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరించిన కవులు

రామచంద్రాపురం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమను పంచే హృదయం కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ కవి నందిని సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం మల్లికార్జుననగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో యరకల యాదయ్య రచించిన నాలుగో కవితా సంపుటి 'నీటి అద్దం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చూసిన వాటినే వాస్తవరూపంలోకి తెచ్చినప్పుడే కవిత్వం రాయగలుగుతామని చెప్పారు. యాదయ్య కవిత్వాలు రాసినా నిరాడంబరంగా ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పా నగేశ్, తెరసం రాష్ట్ర అధ్యక్షుడు శంకరం, కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్‌కుమార్, పొట్లబత్తుల యాదగిరి, పాలకూర్ల లింగస్వామి, ఇతర కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఎస్టీపీ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఐడీఏ బొల్లారం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో ఎస్టీపీ ఏర్పాటు చేయడానికి అధికారులు స్థల పరిశీలన చేశారు. సర్వే నంబర్ 268లో 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించామని తహసీల్దార్ దేవదాస్ తెలిపారు. రూ.62 కోట్లతో మురుగు శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్ఐ జయప్రకాష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కిరణ్ కుమార్‌రెడ్డి, బీరప్పయాదవ్, శ్రీకాంతయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను పక్కాగా అమలు చేయాలి'

మెదక్ కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రకారమే కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగలకు దూరం చేయాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి, మురళి, కొమ్ముశేకులు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అస్తారుగల్ల బాలరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, అధికార ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం


ఖేడ్‌లో గిరిజా షెట్కార్‌ను సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గిరిజా షెట్కార్‌కు ఆదివారం ఖేడ్‌లోని ఆమె నివాసంలో నాయకులు ఘనంగా సన్మానించారు. మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అవుసలి భవాని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవాచారి తదితరులు శాలువాలు, పూలమాలలతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆయా మండలాల అధ్యక్షులు పోచయ్య, శంకర్‌గౌడ్, మధు, సుభాష్‌రావుపటేల్, దేవిదాస్, సతీష్, నిరంజన్, పురంజన్, అరుణ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి : మెదక్ సిటిజన్ ఫోరం


ఈశ్వర్‌నగర్ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఫోరం సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మెదక్ సిటిజన్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో రోడ్లు, మురికి కాలువలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నూతనంగా వెలసిన కాలనీలలో కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సీసీ రోడ్లు, ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు, బస్తీ దవాఖానలో వసతులు, పారిశుధ్య నిర్వహణ తదితరవాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈశ్వర్ నగర్ కాలనీలో అసలే డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇంటిముందు మురుగు పొంగిపొర్లుతున్నదన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మెదక్ సిటిజన్ ఫోరం సభ్యులు కొండల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఆనందం, నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'ను వీక్షించిన బీజేపీ శ్రేణులు


జహీరాబాద్ పట్టణంలో వీక్షిస్తున్న మాజీ ఎంపీ బీబీపాటిల్

జహీరాబాద్/నర్సాపూర్ /నారాయణఖేడ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు టీవీల్లో వీక్షించారు. జహీరాబాద్ పట్టణంలోని ఓ ఇంట్లో మాజీ ఎంపీ బీబీ పాటిల్ పార్టీ శ్రేణులతో కలిసి చూశారు. నర్సాపూర్‌లో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వి. మల్లేశ్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు వీక్షించారు. నారాయణఖేడ్‌లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మోదీ మన్ కీ బాత్‌ను చూశారు.

సృజనాత్మక బోధనతో మనో వికాసం

● మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మనో వికాసానికి సృజనాత్మక బోధన ఎంతో దోహదపడుతుందని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన పోషక మహాశయుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు మారుతున్న 5జీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని సూచించారు.

ఎంపీ సురేష్ షెట్కార్ పరామర్శ

నారాయణఖేడ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మహేంద్రకర్ వివేకానంద్ తండ్రి, ప్రముఖ వ్యాపారి మహేంద్రకర్ భరత సేట్ అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆదివారం ఖేడ్‌లోని రాంవిలాస్ గల్లీలో ఉన్న ఆయన ఇంటి కెళ్లి పరామర్శించారు. భరత సేట్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కూడా పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు


పండరి(ఫైల్)

పుల్కల్, జూన్ 29 :(ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం చక్రియాల గ్రామానికి చెందిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మైన గోని పండరి (53)కి కన్నీటి వీడ్కోలు పలికారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో పండరి విధులు నిర్వహిస్తూ ఈ నెల 27న అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం పండరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. స్వగ్రామమైన చక్రియాల్‌లో ఆదివారం పండరి భౌతికకాయానికి దాహన సంస్కారాలు నిర్వహించారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐలు లింగం, జగన్నాథంలు హాజరై మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. దాహన సంస్కారాల నిమిత్తం రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అందరితో కలుపుగోలుగా వ్యవహరిస్తూ కలివిడిగా ఉండే పండరి మృతితో చక్రియాల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు



ఝరాసంగం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కక్కర్‌వాడ నుంచి పూర్యానాయక్‌తండా వరకు ట్రైబల్ వెల్ఫేర్ నిధులు రూ.2.38 కోట్లతో తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి తక్షణమే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

వర్షాలు కురవాలని..


కంది మండలం జుల్‌కల్ గ్రామంలో వర్షాలు కురవాలని కోరుతూ చిన్నారులతో కలశాల ఊరేగింపు జరిపిస్తున్న గ్రామస్థులు

మునిపల్లి/కంది/కల్హేర్/నారాయణఖేడ్/కొల్చారం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆషాడమాసం ప్రారంభమైనా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంటలు వాడిపోతుండటం, పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడటంతో వర్షాలు కురవాలని కోరుతూ ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, జాతరలు నిర్వహించారు. మునిపల్లి మండలం పెద్ద గోపులారం గ్రామంలోని గంగమ్మ తల్లి ఆలయం పూజలు చేశారు. కంది మండలం జుల్‌కల్‌లో శివలింగానికి మహాకుంభాభిషేకం నిర్వహించారు. చిన్నారులు 108 కలశాలలో పసుపు, పంచామృతం, నవధాన్యాలు, పవిత్ర జలాలను నింపుకొని ఊరేగించారు. కల్హేర్‌లో మండలం మాసానపల్లి ప్రజలు దేవునిపల్లి గ్రామ శివారులోని దేవుని గుట్టపై మలన్నస్వామికి, నారాయణఖేడ్ మండలం రుద్రారం బీరప్ప దేవుడికి, కొల్చారం మండలం వెంకటాపూర్‌లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.